# అయిదు నిముషాలు



హిందీ మూలం: శ్రీ వియోగి

తెలుగు: వాసిరెడ్డి సుబ్బారావు

కేవలం ఐదు నిమిషాలే. ఆయన జైలు కటకటాలకు లోపల, చేతులకు సంకెళ్ళు. మరి నేను - దురదృష్టం! రక్షక భటుల కాపలాలో బయట నిలబడ్డాను, గడగడా వణుకుతూ. కేవలం ఐదు నిమిషాలే మా కలయిక. చూస్తూ ఉండగానే టైం అయిపోయింది.

గత విషయాలను నేను ఎందుకు తలచుకోవాలి ? అవన్నీ కత్తులలా నా గుండెల్లో గుచ్చుకుంటాయి. గత గాధను ఎవరికి చెప్పుకోను ? చెప్పినా మనసు పెట్టి వినేదెవరు ? విన్నా - అయిష్టంగా విని, అమ్మా ! అది నీ అదృష్టం. అంతే. దైవాన్ని తలుచుకోమంటారు నిట్టూరుస్తూ. దరిద్రులకు దేవుడు ఎప్పుడూ సహాయ పడడు. మునిగిపోయేవాండ్లకు ఎన్నడూ చేయూతనివ్వలేదు. ఆకలి అయిన వాండ్లకు ఎప్పుడూ అన్నం పెట్ట లేదు. ఏడ్చేవాండ్ల కన్నీరు తుడిచేందుకు ఆయన ఎన్నడూ రాలేదు. ఆయన స్వర్గంలో వుంటూ, నందనవనంలో విహరిస్తూ, పెండ్లాం చెప్పుచేతుల్లో మెలిగే పెద్ద మనిషి. పాపం! ఆయనకూ స్వేచ్ఛ లేదు. లక్ష్మి ఎవర్ని కనికరిస్తుందో ఆయన అటే. నాలాంటి దరిద్రులతో ఆయనకేం పని ? దురదృష్టమే పేదల పాలిటి దైవం. దురదృష్టంలో పెరిగిన నేను ఆ దేవుణ్ణి ఎందుకు పిలవాలి ? పిలిచినా, తలచినా నా దురదృష్ట దైవాన్నే. ఏదో ఒక రోజున నవ్వుతూ వస్తాడు. ఒక కొండను తెచ్చి నా నెత్తిన వేసిపోతాడు.

ఒకసారి నా దైవాన్ని తలచుకున్నాను. వచ్చాడు. ఒక నిరుద్యోగి, నిరుపేద అయిన గ్రాడ్యుయేట్‌ను నాకు అంటగట్టి వెళ్లాడు. రెండోసారి తలుచుకుంటే - నాకు యిద్దరు బిడ్డలు కలిగారు. మూడోసారి తలుచుకుంటే - నా జీవిత సర్వస్వం, నాలాంటి మునిగిపోయేవారికి గడ్డిపరక సహాయంలావున్న ఆయన ఒక ఖూనీ కేసులో చిక్కుకొని జైలుకు వెళ్లాడు - ఉరిశిక్షపడింది. అంతే. ఇక నేను ఆ దేవుణ్ణి ఎందుకు తలచుకోవాలి ?

పేదరికమే సమస్త అపరాధులకు మూలం అయితే ఆయనకు ఉరిశిక్ష వేయండి. గుండ్లతో కాల్చండి. కుక్కల్ని పీక్కుతిననివ్వండి. అతణ్ణి హంతకుడని నేను అనను. దరిద్రుడని మాత్రమే అంటాను. అతడు ఆకలయిన మనిషేకాని, అపరాధి మాత్రం కాడు. హంతకుడు అసలే కాదు. అతడు ఆపదలలో చిక్కుకున్న దరిద్రుడు మాత్రమే. అంతే కాని, అతణ్ణి పాపాత్ముడనకండి. అన్నం కోసం ఏడ్చే మనిషనండి.

అతడు ఏం చేశాడండి ? ఏం పాపం చేశాడో చెప్పండి. అతడు ఏమీ చేయలేదు. ముమ్మాటికీ ఏమీ చేయలేదు. అతడు చేసింది తన నికృష్టపు పొట్టకోసం, తన దరిద్రపు కుటుంబం కోసం, తన దౌర్భాగ్యపు బిడ్డల కోసం మాత్రమే. చట్టం ఆ ప్రయత్నాన్నీ, దౌర్భాగ్యం ఆ పనినీ 'నేరం' అన్నది. ఉరిశిక్ష విధించింది. సరే. నేను ధైర్యంగా ఫరవాలేదని అంటున్నాను. అతణ్ణి ఉరికంబానికి వ్రేలాడదీసి, నిలువునా ఉరితీసినా నాకు సంతోషమే. కాని అతణ్ణి 'అపరాధి' అని అంటే నేను మాత్రం ఒప్పుకోను.

వందసార్లు - కాదు కాదు వెయ్యిసార్లు అంటాను. అతడు పాపం చేసినవాడు కాదని. అతడు దరిద్రుడు మాత్రమే. కొన నిర్భాగ్యుడయిన మనిషి మాత్రమే. పొట్ట కక్కుర్తి కోసం చెడు సహవాసాలు చేశాడు. దొంగతనాలు చేశాడు. దోపిడీలు చేశాడు. లూటీలు చేశాడు. అవ్వన్నీ తన పొట్ట కక్కుర్తి కోసమే సుమా! నైతికంగా ఆలోచిస్తే అతడు నేరస్తుడే. పాపాత్ముడే. హంతకుడే. బందిపోటు దొంగే. కాని కాస్త మీరు ఆలోచించండి. నీతి అనేది ఈ ప్రపంచంలో ఒక్క పేదలకేనా వర్తించేది? ధనవంతులకు వర్తించదా? చెప్పండి. రామ్‌ధన్ అనే నూనె వ్యాపారి, వూళ్లో వున్న పొలాలన్నింటినీ తాకట్టు పెట్టుకొని కాజేస్తున్నాడే?ఎన్నో కుటుంబాలు అతని వడ్డీలకు వడ్డీలు కట్టలేక మునిగిపోతున్నాయే! అది పాపంకాదా? నా నిరుపేదభర్త చేసిన చిన్న అపరాధమే మహాపాపమా? సరే. ఆయన్ని ఈ ప్రపంచంలో బ్రతకనివ్వకండి. అంతటితో ఈ లోకంలో వున్న పాపద్వారాలన్నీ మూతబడతాయా? అలా ఎన్నడూ జరగదని నేను గట్టిగా చెపుతాను.

## 2

నా భర్త నన్ను కలుసుకోవాలనుకుంటున్నాడనీ, అది చిట్ట చివరి కలయిక అనీ, ఆయన్ని ఎల్లుండి ఉరి తీస్తారనీ, ఆయన చివరి కోరిక - తన బిడ్డల్నీ భార్యనీ చూడాలనుకుంటున్నాడనీ, ప్రభుత్వం నుంచి నాకు ఒక పత్రం అందింది. నేను నా భర్తను చివరిసారిగా చూద్దామని వెళ్లాను. కాదు - కాదు నా భర్త జీవచ్ఛవాన్ని చూద్దామని వెళ్లాను. నేను చూడబొయ్యే ఆయన నెత్తి మీద మృత్యుఛాయలు పడి వున్నాయనీ, ఆయన మెడకు ఉరిత్రాడు బిగియబోతున్నదనీ, ఆయనకు శవం మీద కప్పే వస్త్రం కూడా కొని వుంచారనీ ఎరుగుదును. అంతేకాదు - నా లాగా మీలాగా ఆయన జీవించివుండగానే మరి ! ఆశ్చర్యం కదూ ?

మీ జీవిత సర్వస్వం, మీ ప్రాణ సమానమైన వ్యక్తి, మృత్యు ముఖంలో పడబోతున్నాడనీ ఆయన మెడకు ఉరిత్రాడు వేయబోతున్నారనీ, మీరు ఆయన్ని చూడబోతున్నారనీ, ఇవ్వాళ మీరు చూస్తున్న మనిషి శవం రేపు మీకు అందబోతుందని తెలిస్తే - మీకెలా వుంటుందో - మీరు కొంచెం ఆలోచించండి. చట్టానిది తప్పు అని నేను అనను. న్యాయాన్ని కూడా నేను నిందించబోను. కాని ఒక్కసారి నోరు విప్పి నిజం చెప్పమని మానవత్వాన్ని మాత్రం అడుగుతాను. న్యాయం మూగది. చట్టం చెవిటిది. గ్రుడ్డిది కూడా. దాని ముందు నిలబడ్డ వారిని అది పరీక్షిస్తుంది. కాని హృదయం వున్న మానవత్వాన్ని నా తరపున మాట్లాడమని నేను వేడుకుంటున్నాను.

సరే. అలా నన్ను నేను మరిచి వెళ్లాను. ఒక్కసారి ఆయన పాదాలు స్పృశించాలనీ, ఆయన గుండెమీద తలపెట్టి ఏడవాలనీ అనుకున్నాను. అంతేకాదు; "మీరు నా కోసం ఎదురుచూస్తూ వుంటారుగా? నన్ను మీరు మరిచిపోరుకదా! అని అడగాలని అనుకున్నాను. ఈ దౌర్భాగ్యురాలు ఉరకలు ఎత్తే మీ యౌవనంలో మండే నిప్పులు పోసిందనీ, మీ యౌవనంలో విషాన్ని కుమ్మరించిందని మరిచిపోండి. నన్ను క్షమించండి. వీడు మీ బిడ్డ. కనికరించండి. ఒక్కసారి మీ పితృవాత్సల్యమనే చల్లని జలాలతో అభిషేకం చేయండి. ఇతడు మీ సొత్తు." ఇలాఅనుకుంటూ నేను జైలువైపుకు వెళ్లాను. నా దగ్గరే వున్నాడు మా బిడ్డ గోపాల్. - "అమ్మా, ఎక్కడికి వెడుతున్నావు?" అని అడిగాడు. ఆ అమాయకుడికి ఏం చెప్పను? "నాన్నా! మీ నాన్నను చూడటానికి రావా? ఆయన నిన్ను చూడాలనుకుంటున్నారు" అన్నారు.

వాడు పొంగిపొయ్యి - "అమ్మా! నాన్నగారు రాక చాలా రోజులయింది. నేను ఆయన్ని అడిగి బొమ్మలు కొనిపెట్టించుకుంటాను. డబ్బులు యిప్పించుకుంటాను. ఆ మున్నీకి ఒక్కబొమ్మ కూడా ఇవ్వను. ఆయన మా నాన్నగారు. మున్నీకి ఏం అవుతారేం..!" అన్నాడు. నా గుండె నూరుముక్కలయింది. "అయ్యో, అభాగ్యుడా! మీ నాన్న మృత్యుముఖంలోపడి జైల్లో రోజులు లెక్కపెట్టుకుంటున్నాడ్రా" అనుకుంటూ గుండె చిక్కబట్టుకుని "నాన్నా, నువ్వు దేవుణ్ణి తలచుకో"మన్నాను. గోపాల్ నా చెరగు లాగుతూ "అమ్మా! నాన్న ఎప్పుడు వస్తారు? నా వెంట ఇంటికి తీసుకొస్తాను. నువ్వు నన్ను ఏమీ అనవొద్దు. ఆయన నాకు జయగోవిందునికి వున్న లాంటి చిన్నసైకిల్ తెస్తాడు. అమ్మా, వాడు నన్ను తన సైకిల్ ముట్టుకోనివ్వడు. నేను ముట్టుకుంటే అది విరిగిపోతుందట. నువ్వు చెప్పమ్మా. వాడు వట్టి వెధవాయి. నేను మున్నీని కూడా నా సైకిల్ ముట్టుకోనివ్వను. మున్నీ నా పలక వగులగొట్టిందిగా. వద్దంటే కొరుకుతుంది. నేను నాన్నకు చెబుతాను.."

**ఆయన కనపడీ కనపడని వెలుతురులో నిలువబడ్డాడు, కటకటాలకు అటువైపు. బొంగురుబోయిన కంఠంతో- "ఇదే చివరి కలయిక. ఇదే చిట్టచివరి ఆశీర్వాదం. ఇవే చివరి మాటలు" అంటూ, " రేపు ఉదయం వచి నా శవాన్ని తీసుకువెళ్లు. నేను జైలర్‌తో చెప్పాను" అన్నాడు.**

## 3

జైలరు నన్ను తీసుకువెళ్ళమని ఒక పోలీసును ఆజ్ఞాపించాడు. అతడు నన్న తీసుకెళ్ళాడు. రెండువైపులా జైలుగదులూ, చుట్టూ పెద్దపెద్ద కటకటాలు, అందులో భగవంతుడి సర్వోత్తమ కళకు ప్రతీకలయిన ఎందరో మనుషులు. నలుగురైదుగురు కాదు. నాలుగు-ఐదు వందలకు పైగానే వున్నారు. ప్రపంచంలో నేను ఒక్కదానినే దౌర్భాగ్యురాలిని కాదు. వేలు-లక్షల మంది వున్నారు.

పోలీసు నన్ను తీసుకెళ్ళి ఒక చీకటిగదికి ఎదురుగా నిలబెట్టాడు. గోపాల్ భయంతో వణుకుతూ నన్ను చుట్టుకుని నిలబడ్డాడు.

పోలీసు - 'ప్రకాష్' అని పిలిచాడు.

నేను నలుదిక్కులా చూసాను. ఉరిశిక్ష పడి, తమ చివరి ఘడియలు లెక్క పెట్టుకునే ఖైదీలు మాత్రమే.ఆ గదిలోవుంటారు. ఆగది గోడలకు మాట్లాడే శక్తేవుంటే, ఈ ప్రపంచానికి ఒక అద్వితీయమైయిన సాహిత్యం లభించివుండేది. ఆగదిగోడలకువున్న ప్రతి ఇటుక అలాంటి వ్యక్తుల నిట్టూర్పులతో పండి నిండిపోయింది. భట్టీలలోవున్న మంటలు సామాన్యమయినవి. ఈ నేల మీద ఎందరి కన్నీళ్లు ఇంకి పోయ్యాయో. ఆకన్నీళ్లనన్నింటినీ నిలువచేయగలిగితే, అందులో యీప్రపంచంలోవున్న సగం సంఖ్య సమాజం మునిగిపోయివుండేది. మృత్యుదేవతకు ఆగది అంటే ఎంతో ఇష్టం. భగవాన్! యింతలోనే ఆగదిలో నుంచి ఇనుప కటకటాలను తెరచిన శబ్దం వినపడింది. ఒక బక్కచిక్కిన, అలసిపోయిన, నిరాశ-నిస్పృహలతో కృంగిపోయి, సగం చచ్చిన యువకుడు వాకిలి దగ్గరగావచ్చి నిలువబడ్డాడు. ఇతడే ఆచీకటి గదిలోవుండే ప్రకాష్. అంధ కారబంధురమయిన నా భావిజీవనానికి ఆరిపోబోయే జ్యోతి. నా గోపాలునిపాలిటి వెలుగు. నా ప్రియమయిన మున్నీపాలిటి మెరిసే కాంతి.

'ఐదే నిమిషాల సమయం. త్వరగా మాట్లాడుకోండి. ఆలస్యం చేయవద్దు.' అన్నాడు పోలీసు.

నన్ను దూరంగా నిలువబమని ఆజ్ఞాపించాడు. నేను ఆ ఖైదీకి ఏమయినా ఇస్తానేమోనని అతని భయం. అతని ముఖమంతా వెంట్రుకలమయం. కండ్లు పీక్కుపొయ్యాయి. శరీరం చిక్కిశల్యావశిష్టమయింది. నేను గోపాలునితో నాన్నకు నమస్కారం చేయ్యమన్నాను. నిశ్చేష్టుడయిన గోపాల్ సాష్టాంగ నమస్కారం చేసాడు. నేను కూడా పాదాభివందనం చేసాను. ఆయన కనపడీ కనపడని వెలుతురులో నిలువబడ్డాడు, కటకటాలకు అటువైపు. బొంగురుబోయిన కంఠంతో- "ఇదే చివరి కలయిక. ఇదే చిట్టచివరి ఆశీర్వాదం. ఇవే చివరి మాటలు" అంటూ, " రేవు ఉదయం వచి నా శవాన్ని తీసుకువెళ్లు. నేను జైలర్‌తో చెప్పాను" అన్నాడు. నేను ఆమాటలు వినలేక తలపట్టుకు కూర్చున్నాను.

" నాన్నా! వెడదాం రా!" అన్నాడు గోపాల్. ఆమాటలు వింటూవుంటే గుండెల మీద గునపాలతో గ్రుద్ధినట్లు అనిపించింది. అది ఎంత అమాయకపు మారాం. " నాన్నా! నేను వేరే ప్రపంచానికి వెళ్ళే యాత్రికుడ్ని. నువ్వు బాగా చదువుకో, అమ్మను బాధ పెట్టకు" అన్నాడు ప్రకాష్. అయన కంటి వెంట కన్నీరు ధారలు కట్టింది. ఆయన రాయిలా ఇనుపకడ్డీ పట్టుకొని నిలువబడ్డాడు. " నాన్నా మున్నీ ఏడుస్తున్నది. నా పలక పగులగొట్టింది. నాకు రెండో పలక కొనిపెట్టు" అని గోపాల్ మారాం చేసాడు.

ఆయన ఒక పెద్ద నిట్టూర్పు విడిచి - "విన్నావా ? గోపాల్ పలక పగిలిపోయిందట. వాడికి క్రొత్త పలక కొనిపెట్టు" అన్నాడు నాతో.

నేను ఏం మాట్లాడను? నాకు ఏమీ వినపడనట్టు నిలువబడ్డాను. నాకు ఏమీ కనపడడం లేదు కూడా.

ఆయన మళ్లీ " మీరు సుఖంగా ఉండండి. పిల్లల్ని ముద్దుగా పెంచు. గోపాల్‌ని చదివించు. నేను వస్తాను. నా స్మృతిగా గోపాల్‌ని నీదగ్గర విడిచిపోతున్నాను. దిగులుపడవద్దు. జరగవలసిందే జరిగింది."

నేను " యింకా యింకా చెప్పండి" అన్నాను.

నా కంఠం గాద్గదికమయింది. నా గుండెనెత్తురు కన్నీటి రూపంలో ప్రవహించి ధారలు కట్టింది.

ఐదు నిమిషాల సమయం అయిపోయిందని పోలీసు హెచ్చరించాడు. "మంచిది" అంటూ ప్రకాష్ నా తరపున ఒక్కసారి, నేను చూస్తుండగానే నువ్వు గోపాల్‌ను ముద్దు పెట్టుకోమన్నాడు. "భగవంతుడు నీకు ధైర్యాన్ని ప్రసాదించుగాక, వచ్చే జన్మలో కలుసు కుంటాను. సెలవు" అన్నాడు. పోలీసు - " త్వరపడండి. సమయం అయిపోయింది పద" అన్నాడు.